క్లుప్తంగా

ఆత్మీయ స్వాగతం



మధురవాడ ఐటీ సెజ్‌లో ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సోమవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

తాటిపూడి పైప్‌లైన్ లీక్



బాజీ జంక్షన్ వద్ద లీకవుతున్న నీరు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బాజీ జంక్షన్ వద్ద తాటిపూడి పైపులైన్ లీక్ వల్ల మంచినీరు వృథా అవుతోంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టడానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలిమేర



పాలిమేర శ్రీనివాసరావు

మల్కాపురం: విశాఖ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రెండో సారి పాలిమేర శ్రీనివాసరావు నియమితులయ్యారు. జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీకి చెందిన పాలిమేర శ్రీనివాసరావు వార్డు స్థాయి నుంచి జిల్లా నాయకత్వం వరకు ఎదిగారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి,రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్‌రాజుతో పాటు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎస్.మాధవ్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు దసరాలోగా బోనస్ చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ మిత్రపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్ కార్మికులకు బోనస్ చెల్లింపుపై యాజమాన్యం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. గతేడాది కంటే అదనంగా బోనస్ చెల్లింపుతో పాటు గతేడాది బకాయి రూ.9500 కూడా కలిపి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, మిత్ర పక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, సురేష్‌బాబు, సన్యాసిరావు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీఎండీ అతుల్ భట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

నేడు స్టీల్‌ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు ట్రైనింగ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. కార్మికులకు దసరా ముందు బోనస్ చెల్లించాలని, గతేడాది పెండింగ్ బోనస్ రూ.9500 చెల్లించాలన్న డిమాండ్లపై ధర్నా చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గోవాలని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప కోరారు.

'ఆరోగ్య సురక్ష'.. పేదలకు రక్ష

- జీవీఎంపీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు
- 92, 52, 58 వార్డుల్లో వైద్య శిబిరాలకు విశేష స్పందన



మందులు, కేస్ షీట్ అందిస్తున్న బెహరా భాస్కరరావు



92వ వార్డు వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు



58వ వార్డు వైద్య శిబిరంలో అంగన్‌వాడీ పోషకాహార స్టాల్ వద్ద రేవళ్ల సత్యనారాయణ తదితరులు



సేవలు అందిస్తున్న వైద్యురాలు



ములగాడ ఆరోగ్య కేంద్రంలో మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 92వ వార్డు గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ప్రజా సంక్షేమంపైనే కాకుండా వారి ఆరోగ్య భద్రతపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును బెహరా పరిశీలించి, పేషెంట్లకు కేస్ షీట్లు, మందులు అందజేశారు.

గోపాలపట్నం 476 సచివాలయం పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు వైద్య సేవలను వినియోగించుకున్నారు. పిల్లల వైద్యులు, ఊపిరితిత్తులు, ఎముకలు, కంటి, ప్రసూతి, జనరల్ మెడిసన్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులతో ప్రేమతో మాట్లాడి వారి బాధలను తెలుసుకుని వైద్య సలహాలు, మందులు అందజేశారు. దీర్ఘకాలిక సమస్యలున్న వారిని పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. వైద్య శిబిరంలో గోపాలపట్నం బెహరా ఆస్పత్రి వైద్యులు సేవలు అందించారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సహకరించారు.

400 మందికి వైద్య సేవలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. హిమాచల్‌నగర్ సచివాలయం పరిధి ప్రజలు హాజరయ్యారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరూప పర్యవేక్షణలో వైద్యులు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. ఈఎన్‌టీ, డెంటల్, జనరల్ ఫిజీషియన్, గుండె తదితర నిపుణులు రోగులకు వైద్య సేవలందించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తదితర చిరుధాన్యలతో తయారు చేసి ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, సీవో వెంకటరమణ, నాయకులు పెంటారావు, గాలి సన్యాసిరావు, శేఖర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరాజుపాలెంలో 214 మందికి వైద్య సేవలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 214 మంది వైద్య సేవలు పొందారు. ఇందులో 57 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి శ్రీను, ప్రసాదరెడ్డి శిబిరం నిర్వహణకు అవసరమైన సహకారం అందించారు. జీవీఎంసీ 8వ జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు శిబిరాన్ని సందర్శించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ మెడికల్ అధికారి కృష్ణంరాజు, సచివాలయ , వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

205 మందికి వైద్య సేవలు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 ఐటీఐ జంక్షన్ తుమ్మడపాలెం సచివాలయానికి సంబంధించి భవాని గార్డెన్స్ యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నేతృత్వంలో జీవీఎంసీ అధికారులు, వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేశారు. 54వ వార్డు కార్పొరేటర్ ముద్రు వాణి నానాజీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 205 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ ఎ.ఎల్.శాంతి తెలిపారు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో రోగులు, వైద్య సిబ్బందికి భోజన సదుపాయం అందించారు. కార్య క్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, నాయకులు నానాజీ, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు ఓపిగ్గా విన్నారు



ఊపిరితిత్తుల సమస్యతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యుడిని కలిశారు. నా సమస్యలను ఓపిగ్గా విని మంచి సూచనలిచ్చారు. ఇక్కడికి రావడం సంతృప్తినిచ్చింది.
– నిర్మలాకుమారి, గోపాలపట్నం

సందేహాలు నివృత్తి చేశారు



జనరల్ ఫిజీషియన్ వద్ద నా సమస్యలు చెప్పుకున్నాను నాలో ఉన్న సందేహాలు నివృత్తి అయ్యాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. – బల్లిన లక్ష్మి, శ్రీరామ్‌నగర్

మోకాళ్ల నొప్పులకు మందులిచ్చారు



మోకాళ్ల నొప్పులు ఉన్నాయని వైద్య శిబిరంలో ఎముకల వైద్యుడిని సంప్రదించాను. మంచి సూచనలిచ్చి ఉచితంగా మందులు అందించారు. తదుపరి వైద్యం గురించి తగు సలహాలిచ్చారు.
– యు.లక్ష్మి, నరసింహనగర్

ఆరోగ్య సురక్ష మంచి కార్యక్రమం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం చాలా మంచి కార్యక్రమం. దీని ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వ వైద్యం చేరువ చేస్తున్నారు. శిబిరంలో వైద్య సేవలు బాగున్నాయి.
– ఎస్.నారాయణమ్మ, బాపూజీనగర్

చెంతకే వైద్యం



ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. గోపాలపట్నం హైస్కూల్‌లో 17, 18, 19 తేదీల్లో, 20న స్టేషన్ రోడ్డులోని ఎంపీపీ స్కూల్‌లో 20న, పాత గోపాలపట్నం ఎంపీపీ స్కూల్‌లో 21న వైద్య శిబిరాలు జరుగుతాయి.
– బి.పూజ,లక్ష్మీనగర్‌యూపీహెచ్‌సీ వైద్యురాలు

అభివృద్ధిలో విశాఖ పరుగు

ఆడారి ఆనంద్‌కుమార్



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: అభివృద్ధి పథంలో విశాఖనగరం పరుగులు తీస్తుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. బాజీ జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రహదారి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విశాఖనగరాన్ని అగ్రశ్రేణిలో నిలపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే ఆరోగ్య కేంద్రాలు, కొన్ని ప్రాంతాల్లో సామాజిక భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇటీవల పద్మనాభనగర్‌లో కాపు సామాజిక భవనం నిర్మాణానికి నిధులు మంజూయ్యాయని తెలిపారు. మూడు బీఆర్‌టీఎస్ రహదారులను జీవీఎంసీ నిధులు రూ.3.68 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, డీఈ వియకుమార్, ఏఈ వెంకటలక్ష్మి, 91, 92వ వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చుక్క ప్రసాదరెడ్డి, నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, ఆళ్ల పైడిరాజు, స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, దేరెడ్ల సత్యనారాయణ, పైడిరాజురెడ్డి, సాధూరావు, తమ్మి రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు..

గోపాలపట్నం: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 91వ వార్డు 483 సచివాలయం పరిధి లక్ష్మీనగర్‌లో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుతో కలిసి ఆనంద్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వారు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు నమ్మి వెంకట కృష్ణ మూర్తి యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, వూటపల్లి గోవిందు, రమేష్, దుర్గేష్, దేరెడ్ల సత్యనారాయణ, రాజశేఖర్, బల్లంకి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి సమస్యపై సీఎంకు వినతి



సీఎం వైఎస్ జగన్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని ప్రధాన రహదారి సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తీసుకెళ్లారు. సోమవారం విశాఖ వచ్చిన సీఎంను కలసిన ఆయన వార్డు పరిధిలో ప్రధాన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎన్ హెచ్–16 నుంచి పాస్ పోర్టు ఆఫీసు, నేతాజీ నగర్ మీదగా ది పెంత్ కోస్టల్ చర్చి అనుకొని అరకు బౌడరా రోడ కనెక్ట్ చేసే ప్రస్తుత 30 అడుగుల రోడ్డును 60 అడుగుల మేర విస్తరించాలని కోరారు. దీనిపై సీఎం జగన్ మోహన్ రెడ్డి సానకూలంగా స్పందించారని శ్రీధర్ తెలిపారు.

ఐక్య ఉద్యమాలతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

సింథియా: ఐక్య ఉద్యమాల ద్వారానే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం డాక్‌యార్డ్, ఇతర రక్షణ రంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనుబంధ సంస్థ ఈఎన్‌సీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. సభలో అచ్యుతరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ట్రేడ్ యూనియన్లు ఐక్య ఉద్యమాలకు దూరంగా ఉంటున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. నూతన పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పద్ధతి కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సబ్బం కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉడతా అప్పలరాజు, ఉపాధ్యక్షులు మన్యాల ప్రసాద్‌బాబు, హెచ్.ఎం.ఎస్.మాజీ అధ్యక్షుడు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మల్కాపురం: పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. సమస్యపై కోరమాండల్ వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలపై ప్రభుత్వాధికారులు హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేరలేదన్నారు. 15 రోజుల్లో కార్మికులకు హెల్త్ అలవెన్స్,పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమిస్తామన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీ విభాగానికి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణి కుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్‌ఎస్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన

మల్కాపురం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మల్కాపురం సీపీఎం జోన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై వారు మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. సీపీఎం నాయకుడు పైడిరాజు మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో రూ. 150 కట్టే వారికి నేడు రూ.500లు కట్టాల్సిన పరిస్థితి కలుగుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి పెంచిన చార్జీలు తగ్గించాలని,లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ



ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

విశాఖ విద్య: దసరా ఉత్సవాల సందర్భంగా బుచ్చిరాజుపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ– బంగారమ్మ ఆలయ నిర్వాహకులు రోజూ భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. భక్తులు అమ్మవారి సేవలో తరిస్తూనే రుచికరమైన భోజనం స్వీకరిస్తూ అన్నదాత సుఖీభవ అంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జి, జగన్, కుమార్, గోపి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే పూజల్లో పాల్గొనేందుకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దాతల సహకారంతో వీరికి అన్న ప్రసాదం అందించేలా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ముగిసే వరకు ప్రతీ రోజూ అన్నప్రసాద వితరణ చేయనున్నారు.

దుర్గమ్మకు విశేష పూజలు



బాలా త్రిపురసుందరిదేవి అలంకరణలో ధనలక్ష్మి



అమ్మవారిని దర్శించుకున్న మూర్తియాదవ్ దంపతులు

సింథియా: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం దుర్గమ్మకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. 62వ వార్డు దుర్గానగర్, గుడివాడ అప్పన్న కాలనీ, త్రినాథపురం, ఏఎస్సార్ కాలనీల్లో నిర్వహిస్తున్న వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. మజ్జి మాలినాయుడు, స్థానిక యువత, మహిళలు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దుర్గాదేవి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారికి పలు పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. జిల్లా యాదవ సంఘం ప్రతినిధి మూర్తియాదవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. 59వ వార్డు సక్కువానిపాలెం, జనతా కాలనీ, గాజువాక ఆర్టీసీ డిపోల వద్ద గల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలా త్రిపురసుందరిగా ధనలక్ష్మీదేవి

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మీదేవి ఆలయంలో సోమవారం అమ్మవారిని బాలా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శ్యామాచార్యులు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు వల్లా సత్యనారాయణ నేతృత్వంలో భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.



దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

యోగా పోటీల నిర్వహణకు రూ.లక్ష అందజేత



కమిటీ ప్రతినిధులకు చెక్ అందజేస్తున్న ఆదినారాయణ

అక్కిరెడ్డిపాలెం: యోగా విలేజ్‌లో ఈ నెల 29వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీ, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న యోగా పోటీలకు 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన యోగా అసోసియేషన్ ప్రతినిధి గోపిశెట్టి ఆదినారాయణ లక్ష రూపాయలు అందజేశారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులకు సోమవారం చెక్కు అందించారు. పోటీలకు 13 జిల్లాల నుంచి సుమారు 6 వందల మంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ఉక్కు భూనిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 977వ రోజు సోమవారం, స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.